క్లుప్తంగా

ఆర్థిక సాయం

ధవళేశ్వరం: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ధవళేశ్వరానికి చెందిన పిల్లా సాయికి జనసేన నాయకులు రూ.4.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ చేతుల మీదుగా బుధవారం బాధితుడికి అందించారు. **కడియం:** మండల కాపు ఐక్యవేదిక వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన రూ.50 వేలను కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందించారు.

అన్నసమారాధన

కడియం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా దుళ్ల బిల్డింగ్ బడి వీధిలో బుధవారం భారీ అన్నసమారాధన జరిపారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గంవర్క్‌లో 68వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభమైనట్లు నిర్వాహకుడు జి.గుబ్బల రాంబాబు బుధవారం తెలిపారు. స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రంలో సుమారు 70 మందికి ఉచితంగా మెటీరియల్ అందించామన్నారు. 45 రోజుల పాటు ఈ శిక్షణ జరుగుతుందని, అభ్యర్థులకు ఉచిత మెటీరియల్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. అలాగే వివిధ సామాజిక అంశాలపై అవగాహన కూడా కల్పిస్తామన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక బహుకరిస్తామని, ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉత్తీర్ణులైన వారికి ప్రత్యేక బహుమతి అందిస్తామన్నారు. ఆసక్తి కల మహిళలు స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

కౌశల్ క్విజ్ విద్యార్థులకు వరం

కంబాలచెరువు: విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి ఏడాది నిర్వహించే కౌశల్ 2023 కార్యక్రమం పోస్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం బుధవారం డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వదేశీ సైన్స్ ఆవిష్కరణలు, మన దేశ ప్రగతిని తెలుసుకోవడానికి కౌశల్ క్విజ్ ఒక చక్కటి వేదికన్నారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులు ఈ కాంపిటేషన్‌లో పాల్గొనడం ద్వారా వారికి మంచి ప్రావీణ్యత లభిస్తుందన్నారు. భవిష్యత్తులో వారికి పోటీ పరీక్షలకు ఎంతో ఉపయుక్తమన్నారు. ప్రతి స్కూల్ నుంచి 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డీవైఈవో ఈవీవీఎస్ఎన్ నారాయణ, కౌశల్ క్విజ్ జిల్లా కో ఆర్డినేటర్ మేకా సుసత్యరేఖ, సహ కోఆర్డినేటర్ సూర్యచంద్ర, జిల్లా జాయింట్ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, ఫణికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఏదైనా అన్యాయం జరిగితే వెంటనే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డాక్టర్ మాణిక్యాంబ, ఎం.అర్జునరావు, జి.వసంత, బీవీ శారదాదేవి పాల్గొన్నారు.

సర్క్యులర్ రద్దు చేయాలి

సీటీఆర్ఐ: వీఓఏ, ఆర్పీలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, డ్వాక్రా సంఘాల మెర్జ్ ఆపాలని ఏపీ వెలుగు వీఓఏ (యానిమేటర్లు) ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ జి.ప్రమీల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏఓకి వినతిపత్రం అందించారు.

గౌతమీ జీవ కారుణ్య సంఘానికి విరాళం



కొండబాబుకు చెక్కు అందజేస్తున్న దాతలు

సీటీఆర్ఐ: గౌతమీ జీవ కారుణ్య సంఘం వ్యవస్థాపకుడు, కీర్తిశేషులు కారుణ్యానంద స్వామి వర్ధంతి, జయంతి కార్యక్రమాల నిర్వహణ కోసం ఆ సంఘం ఆశ్రమాన్ని ఆనుకుని ఉన్న షాపుల యజమానులు రూ.18 వేల విరాళం ఇచ్చారు. చైర్మన్ బర్రే కొండబాబు, దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి సమక్షంలో బుధవారం సంస్థకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మగమాటి సత్యనారాయణ, తిరగాట్టి దుర్గారావు, వాసంశెట్టి ఏడుకొండలు, సోమరాజు పాల్గొన్నారు.

బాబోయ్ దొంగలు

- నర్సరీల్లో తరచూ మొక్కల మాయం
- రూ.పది విలువైనవీ అపహరణ
- తలలు పట్టుకుంటున్న రైతులు



కడియపులంకలోని ఒక నర్సరీలో దొంగలు మొక్కలను లాక్కుపోగా మిగిలిన ప్యాకెట్లు

కడియం: కడియం ప్రాంత నర్సరీ రైతాంగానికి కొత్త చిక్కొచ్చిపడింది. నర్సరీల్లో ఉన్న మొక్కలను దొంగలెత్తుకుపోతున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక నర్సరీ రైతులు తలలు పట్టుకుంటున్నారు. రాత్రి చూసిన మొక్కలు ఉదయం తిరిగి నర్సరీకి వెళ్లే సరికి ఉంటాయో? లేదో? అన్న అనుమానం రైతులు వ్యక్తమవుతోంది. ఎటువంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ఉన్న నర్సరీల యజమానులు ఎటూ పాలుపోక ఇబ్బందులు పడుతున్నారు.

నర్సరీ రైతుల ఆశ్చర్యం

ఇప్పటి వరకు జరిగిన చోరీల్లో ఎక్కువ ధర పలుకుతూ, డిమాండ్ ఉన్న మొక్కలు మాత్రమే ఉండేవి. అయితే ఇటీవలి కాలంలో పెద్దగా ధర పలకని మొక్కలను కూడా ఎత్తుకుపోతుండడం పట్ల నర్సరీ రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కడియపులంక పంచాయతీ పరిధిలో ఒక రైతుకు చెందిన నర్సరీ నుంచి టికోమా రెడ్ రకం 500 మొక్కలు ప్యాకెట్లలో ఉన్నవాటిని లాగేసి పట్టుకుపోయారు. వీటి ధర చిన్న ప్యాకెట్లలో రూ.10 నుంచి మొదలవుతుంది. అలాగే ఇదే పంచాయతీ పరిధిలో మరో రైతుకు చెందిన ఎర్రచందనం మొక్కలు 60 కూడా చోరీ జరిగాయి. వీటి ధర కూడా రూ.100 నుంచి ప్రారంభమవుతుంది.

దొంగలా, ఆకతాయిలా..

గతంలో మిర్చిమేరీ గ్రీన్ వంటి అధిక ధర పలికే మొక్కలు, స్థానికంగా లభ్యం కాని మొక్కలు చోరీకి గురయ్యేవి. ఇటువంటి చోరీలు చేస్తున్న దొంగల కదలికలు సీసీ కెమెరాల్లో కూడా రికార్డయ్యాయి. ఆ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవలలి స్వల్ప ధరల్లో దొరికే మొక్కలు కూడా మాయవుతుండడంపై రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇది నిజంగానే దొంగల పనా? లేక ఇబ్బందులు పెట్టేందుకు ఆకతాయిలు చేస్తున్న దుశ్చర్యలా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అర్ధరాత్రి దాటాక..

కడియం, చుట్టుపక్కల మండలాల్లో విస్తరించి ఉన్న నర్సరీల్లో సాధారణంగా జనసంచారం నిత్యం ఉంటుంది. శివారు నర్సరీల్లో తప్పితే కడియపులంక, కడియం, పొట్టిలంక, దుళ్ల, వీరవరం తదితర గ్రామాల పరిధిలో నర్సరీల్లో నివాసం ఉండేవారు, పలు రకాల పనుల నిమిత్తం తిరిగే నర్సరీ రైతుల రాకపోకలు రాత్రి 12 గంటల వరకు కొనసాగుతుంటాయి. అయితే ఆ తరువాతే చోరీలు ఎక్కువ చోటు చేసుకుంటున్నాయి. ఈ చోరీలను అడ్డుకోవడం ఎలాగో అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

> **ఏం చేయాలో తెలియడం లేదు**
>
> పొలాల్లోని మొక్కలు చోరీల ఇటీవల ఎక్కువైంది. ధర ఎక్కువ ఉన్న మొక్కలు చోరీ చేశారంటే ఏదో అనుకున్నాం.. కానీ రూ.10 విలువ చేసే మొక్కలను కూడా లాక్కుపోతున్నారు. ఇది ఆకతాయిల పనా? లేక దొంగలేనా? అన్నది అర్థం కావడం లేదు. పోలీసులు రాత్రి పూట పహరా పెంచాలని కోరుతున్నాం.
>
> – మణికంఠ, నర్సరీ రైతు, బుర్రిలంక

ఆరోగ్య సురక్ష పేదలకు వరం



కాతేరులో మందులు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్



దామిరెడ్డిపల్లిలో కళ్లజోళ్లు అందజేస్తున్న తాడాల చక్రవర్తి

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- శిబిరాల్లో పలువురికి వైద్య సేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు పేదలకు వరమని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరు సచివాలయం 5 పరిధిలో వైద్యశిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. శిబిరంలో 514 మందికి వైద్యసేవలు అందించగా, 27 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. పిడియాట్రీషియన్ వెంకటేష్, జనరల్ మెడిసిన్ వడ్డి ప్రియాంక, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ నేతృత్వంలో డాక్టర్లు లిడియా సుచిత్ర, ఈ.నాగదుర్గ, జగదీష్ కృష్ణ సేవలందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట కల్యాణ్, యెజ్జు వాసు, సచివాలయ కన్వీనర్లు గూడూరి సురేష్, దార్ల రాము, నూకాచారి పాల్గొన్నారు.

483 మందికి వైద్య పరీక్షలు

కడియం: మండలంలోని దామిరెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 483 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జెస్సీ సుప్రియ ఆధ్వర్యంలో జనరల్, గైనిక్, ఆప్తమాలజీ, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షలు జరిపారు. 25 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 17 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సహాయం అందించేందుకు నమోదు చేశారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, ఎంఈవో వి.లజపతిరాయ్, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ ముద్రగడ జెమి, మాజీ సర్పంచ్ ముద్రగడ ప్రసాద్, పార్టీ నాయకులు ధర్మాసనం వీరభద్రరావు నందపునీడి గంగారావు, బుడ్డిగ వీర వెంకట్రావు గౌడ్, తాతపూడి రాంబాబు, నరమామిడి వెంకటేశ్వరరావు, చింతపర్తి చిట్టిబాబు, వెంకన్న, చెల్లయ్య పాల్గొన్నారు.

బీజేపీ మోర్చా అధ్యక్షుల నియామకం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు వివిధ మోర్చా అధ్యక్షులను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు బుధవారం తెలిపారు. కాలెపు సత్యసాయిరామ్ (ఓబీసీ మోర్చా), కందికొండ రమేష్ (యువ మోర్చా), మద్దిపాటి స్వర్ణ రజనీ (మహిళా మోర్చా), నిడమర్తి సత్యకుమార్ (కిసాన్ మోర్చా), దున్నా సుమన్ బాబు (ఎస్సీ మోర్చా), జెడ్ఏ బేగ్ (మైనార్టీ మోర్చా) నియమితులయ్యారన్నారు.

జిల్లాలో 10,510 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా తొమ్మిదో రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా 18 వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో సాయంత్రం 6 గంటలకు వరకూ 10,510 మంది వైద్యసేవలు పొందారు. వీరిలో 444 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామని డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డా.మౌనిక తెలిపారు.

మానసిక ఆరోగ్యంతోనే వికాసం

రాజానగరం: మానసిక ఆరోగ్యం బాగుంటేనే మనిషి వికాసం సాధ్యమవుతుందని రాజమహేంద్రవరంలోని జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం సైక్రియాటిస్ట్ డాక్టర్ తేతలి రామారెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గైట్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆందోళన, నిస్పృహ, ఒత్తిడిని అధిగమించడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఇందుకోసం నిత్యం యోగా, వ్యాయామం చేస్తూ, మిత్రులతో గడపడం, సంగీతం వినడం చేస్తుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, ఎన్ఎస్ఎస్ పీఓలు ఎంవీఎస్ కుమార్, షేక్ మీరా (గైట్ ఫార్మసీ), విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళిక, కృషితోనే లక్ష్య సాధన

రాజానగరం: ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు సరైన ప్రణాళిక, అందుకు అవసరమైన కృషి ఉండాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ ఫస్టియర్‌లో ప్రవేశించిన విద్యార్థులతో బుధవారం దీక్షారంభ్ కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ల విద్యార్థులకు సీనియర్లు మార్గదర్శకులుగా నిలబడి, వారి లక్ష్యసాధనకు తోడ్పడాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన విద్య సమాజంలో ఉన్నత స్థాయిని చేరుకునేందుకు ఉపయోగపడుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు, ఆచార్య కేవీ రావు, ఆచార్య ఎస్‌పీఎల్ నరసింహం, ఆచార్య పి.సురేష్ వర్మ, డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ తలారి వాసు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు

- కోఆర్డినేటర్ చందన
- నూతన భవనాలు ప్రారంభం



రాజవోలులో సచివాలయం 1 భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. రాజవోలులో సచివాలయం 1, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు వచ్చి చేరుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో ఆర్డినేటర్, గ్రామ ప్రత్యేకాధికారి ఆరమ్‌స్ట్రాంగ్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పంచాయతీ కార్యదర్శి జి.కాశీ విశ్వనాథం, సచివాలయ కన్వీనర్లు సింహాద్రి రామలక్ష్మి, జుత్తుక వసంత్, బూసి కృష్ణ, సోడదాసి కేతన, సంగిశెట్టి సత్యనారాయణ, కాకరపర్తి కన్నబాబు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

కడియం: ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. దుళ్ల ఎస్సీపేటలో రూ.22 లక్షలతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంకు పనులకు బుధవారం ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గుర్తించిన గ్రామాల్లో ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం జరుగుతోందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ. 16 లక్షలతో డ్రైనేజీ పనులకు, రూ.31 లక్షల తాగునీటి పైప్‌లైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు సన్నపు బ్రహ్మానందం, సుధాకర్, లక్ష్మీనారాయణ, వెంకట్రావు, నామాల యేసు, వీరన్న, కిట్టయ్య, అన్నవరం, జిలగం గంగాధరం, నాగమణి, శివకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి



నరేష్ బాబు మృతదేహంతో ఆందోళన చేస్తున్న స్థానికులు, కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: హత్యకు గురైన ఇసిరి నరేష్ బాబు (పెద్ద) కుటుంబానికి న్యాయం చేయాలంటూ బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో స్థానికులు ఆందోళన చేపట్టారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పెద్ద మృతదేహాన్ని బుధవారం సాయంత్రం 6 గంటలకు ఇంటికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్నేహితులు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిందితుడు రంకిరెడ్డి ప్రేమ్‌కుమార్ ఇంటి ముందు పెద్దను మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు. పలువురు మహిళలు మాట్లాడుతూ ప్రేమ్‌కుమార్ వల్ల జేఎల్‌బీ నగర్ ప్రాంత వాసులకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలన్నారు. మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకురాలు ఎలుగొండ లక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీను, పిల్లా తనూజ, మరడాపు చిన్న, మరడాపు రాంబాబు తదితరులు ఆందోళనకు మద్దతుగా నిలిచారు.

ఆందోళన కారులతో చర్చలు

బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మృతుని భార్య ప్రియాంక, తల్లి సత్యవతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ వెంటనే రాష్ట్ర శెట్టి బలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీనును సంఘటన స్థలానికి పంపించారు. దీంతో ఆయన ఆందోళనకారులతోనూ, ఇన్‌స్పెక్టర్ విజయకుమార్‌తోను చర్చలు జరిపారు. నిందితుడు రంకిరెడ్డి ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు చేయడం జరిగిందన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసేందుకు పాలిక శ్రీను ఎంపీ భరత్‌రామ్, చందన నాగేశ్వర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో ఎంపీ భరత్‌రామ్ మృతుని కుటుంబాన్ని గురువారం సామర్లకోట రానున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. అలాగే చందన నాగేశ్వర్ ఆర్థికంగా ఆ కుటుంబానికి సాయం అందిస్తామని హామీ ఇచ్చారని పాలిక శ్రీను తెలిపారు. దీంతో రాత్రి 10.30 గంటల సమయంలో ఆందోళనను విరమించారు. అనంతరం పెద్ద మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకువెళ్లారు.

సీఎం జగన్‌కు ఆహ్వానం



సీఎం జగన్ దంపతులకు పెళ్లి పత్రికను అందజేస్తున్న జక్కంపూడి రాజా, విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు

రాజానగరం: వైఎస్సార్ సీపీ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దంపతులకు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కుటుంబ సమేతంగా అందజేశారు. తన మాతృమూర్తి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, సతీమణి డాక్టర్ రాజశ్రీ, సోదరి సింధూతో కలిసి బుధవారం ఆయన తాడేపల్లి వెళ్లారు. అక్టోబర్ 26న దివాన్ చెరువులోని డీవీబీ రాజు లేఅవుట్‌లో జరిగే పెళ్లి రిసెప్షన్‌కు రావాలని ఆహ్వానించారు.

బీసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, చిత్రంలో ఎంపీ బోస్

- ఎంపీ సుభాష్ చంద్రబోస్
- ధవళేశ్వరంలో సమావేశం
- పాల్గొన్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ధవళేశ్వరంలోని రెండు, నాలుగు సచివాలయాలకు సంబంధించి బీసీల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం స్థానిక హీరా ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, ఏపీ జీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అధ్యక్షత వహించారు. బోస్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ బీసీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జి పెయ్యల రాజేష్, పార్టీ నాయకులు తలారి వరప్రసాద్, హమీద్ బాషా, కేతా సాయి, పేర్ల దుర్గాప్రసాద్ (బాసి), పెన్నాడ జయప్రసాద్, ఎస్‌వీ శేఖర్, చాటకాల చంటి, దేవులపల్లి సరితాదేవి, పట్టపగలు వెంకటలక్ష్మి, కల్యాణి రెడ్డి, పెన్నాడ లక్ష్మి, పసుపులేటి దేవి, అయినం చంద్రశేఖర్, మెండా రాజేష్, విప్పర్తి విజయ్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

తెలుగు పరిరక్షణకు కవి సమ్మేళనాలు



గజల్ శ్రీనివాస్‌తో అపుస్మా నాయకులు, భాస్కర్ రామ్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: తెలుగుభాష, సంస్కృతిని పరిరక్షించుకోవడానికి విద్యార్థులతో కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేయించాలని ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులను ప్రముఖ గజల్ గాయకుడు, ఆంధ్రకళా పరిషత్ కళావేదిక అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ కోరారు. గైట్ కళాశాలలో 2024 జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహించే రెండో ప్రపంచ తెలుగ మహాసభల కార్యక్రమ నిర్వహణపై బుధవారం స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్‌కిడ్స్ స్కూల్లో ఏపీ ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకుల సంఘం (అపుస్మా) నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రోటరీక్లబ్ మాజీ గవర్నర్, ప్రముఖ ఆడిటర్ భాస్కర్‌రామ్, అపుస్మా నాయకులు కళ్యాణ్ రెడ్డి, మురళి, శివాజీ, గంగిరెడ్డి, ఉదయ్ భాస్కర్, గంగాధరరావు, శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడిపూడి పార్థసారథి, ఫ్యూచర్ కిడ్స్ డైరెక్టర్ డైరెక్టర్ రవిబాబు యేలేటి పాల్గొన్నారు.

న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహారదీక్ష చేస్తున్న న్యాయవాదులు

రాజమహేంద్రవరం సిటీ: కోర్టు లావాదేవీల్లో వినియోగించే వెల్ఫేర్ స్టాంప్‌ను రూ.20కు పెంచుతూ తీసుకున్న నిర్ణయం తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తూ ది రాజమండ్రి బార్ అసోసియేషన్ వద్ద బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో న్యాయవాదులు చెరుకూరి రామారావు చౌదరి, సుమన్ పాల్, ఎంవీ రామకృష్ణ, ధర్నాల కోట వెంకటేశ్వరరావు, అవిడి రూపరాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంచిన వెల్ఫేర్ స్టాంప్ రద్దు చేయాలని, న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకుని రావాలని, వారి కుటుంబాలకు రావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ తక్షణమే విడుదల చేయాలని, డెత్ బెనిఫిట్‌ను రూ.4 లక్షల నుంచి రూ. పది లక్షలకు పెంచాలంటూ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకూ దీక్షలు కొనసాగిస్తామన్నారు. కాగా.. వీరి దీక్షకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల లీగల్ సెల్ కో ఆర్డినేటర్ సాదిక్ హుస్సేన్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు డీవీవీ త్రినాథ్, కార్యదర్శి పీవీవీఎస్ బి.రాజు, అడ్వకేట్ వెల్ఫేర్ పోరాట కమిటీ కన్వీనర్ నర్సింగ్ శ్రీనివాస్, అంబటి మురళికృష్ణ, సింగ్ సురేంద్ర ప్రసాద్, అల్లంపల్లి రామకృష్ణ, అడ్వకేట్ గుమస్తాలు సంఘీభావం తెలిపారు.

ఉత్సాహంగా రోల్‌ప్లే, జానపద నృత్య పోటీలు



విద్యార్థినుల జానపద నృత్యం





రోల్‌ప్లే చేస్తున్న విద్యార్థిని

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి రోల్‌ప్లే, జానపద నృత్య పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మొదటిరోజు రాజమహేంద్రవరం, రామచంద్రపురం, కాకినాడ డివిజన్లలోని 14 పాఠశాలల నుంచి విద్యార్థులు రోల్‌ప్లే, జానపద నృత్య పోటీల్లో పాల్గొన్నారు. అధ్యాపకులు కేవీ సూర్యనారాయణ, డీఎస్‌వీ సత్యనారాయణ, ఎస్.బాలరాజు, ప్రధానోపాధ్యాయులు శర్మ, వీరభద్రరావు, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. గురువారం అమలాపురం, రంపచోడవరం, పిఠాపురం డివిజన్ల పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని డైట్ ప్రిన్సిపాల్ ఎస్‌డీవీ రమణ తెలిపారు.